క్లుప్తంగా

గంగమ్మ ఆలయానికి రూ.లక్ష విరాళం



విరాళం ఇస్తున్న పాముల రమేష్‌రెడ్డి

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ ఆలయ అభివృద్ధి పనులకు వైఎస్సార్ సీపీ నేత పాముల రమేష్‌రెడ్డి గురువారం రూ.లక్ష విరాళమిచ్చారు. ఈ మేరకు నగదును ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి చేతుల మీదుగా ఆలయ ఈవో ఎం.మునిక్రిష్ణయ్యకు అందజేశారు. కార్యక్రమంలో తొండమనాటి వెంకటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ ఆదం రాధారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన జడ్జి గురునాథ్



తిరుపతి లీగల్ : తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జిగా ఎం.గురునాథ్ గురువారం బాధ్యతలను స్వీకరించారు. ప్రస్తుతం ఆ కోర్టుకు ఇన్‌చార్జి న్యాయమూర్తిగా ఉన్న రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నాగరాజ నుంచి బాధ్యతలు చేపట్టారు. జడ్జి గురునాథ్ ఇదివరలో రాష్ట్ర హైకోర్టు పరిధిలోని రాష్ట్ర న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంతకుముందు తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేశారు.

జిల్లా జడ్జిని కలిసిన న్యాయవాదులు



తిరుపతి లీగల్ : కొత్తగా ఎన్నికైన తిరుపతి న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు గురువారం చిత్తూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావును మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. తిరుపతి కోర్టు ఆవరణలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా న్యాయసేవా సంస్థ కార్యదర్శి జడ్జి కరుణకుమార్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వెంకటకుమార్, ఉపాధ్యక్షుడు గోపీచంద్, ప్రధాన కార్యదర్శి మురళి, మహిళా మెంబర్ మల్లీశ్వరి పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి ఘన స్వాగతం



తిరుపతి గాంధీ రోడ్ : తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతి రైల్వే స్టేషన్‌కు చేరుకున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి బీజేపీ నాయకులు గురువారం ఘన స్వాగతం పలికారు. గుండాల గోపీనాథ్ రెడ్డి, భాను ప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్, తొండం నాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న పరిణయ వస్త్ర ప్రదర్శన

తిరుపతి కల్చరల్: దేశంలోని వివిధ రాష్ట్రాల చేనేత కార్మికులు, డిజైనర్ల ఆధ్వర్యంలో కెన్సెస్ హోటల్లో ఏర్పాటు చేసిన పరిణయ వస్త్ర ప్రదర్శన సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. నిర్వాహకుడు టీవీ.రావు మాట్లాడుతూ వివాహ శుభకార్యాలతోపాటు పండుగలు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ధరించేందుకు వీలుగా ఉప్పాడ, కళంకారీ, మంగళగిరి, ప్రింట్, సిల్క్ చీరలు, కాటన్, కాశ్మీర్ సిల్క్, బ్రౌజ్‌లు, టాప్స్, వన్ గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ తదితరాలు లభిస్తాయని తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శన శుక్రవారం ముగిస్తుందని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

రామచంద్రాపురం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎస్పీ యశ్వంత్ హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ కేసులు త్వరితగతిన పూర్తి చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి శాంతిభద్రతలకు కృషి చేయాలన్నారు.

మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ

తిరుపతి కల్చరల్: రాస్ జన్ శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో నెహ్రూనగర్‌లో ఏర్పాటుచేసిన ఉచిత టైలరింగ్ శిక్షణా తరగతులను గురువారం ప్రారంభించారు. రాస్ కో ఆర్డినేటర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు చేతివృత్తులు నేర్చుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. రోటరీ క్లబ్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి మహిళా పొదుపు సంఘాల్లో చేరి కుటుంబాలకు ఆసరాగా ఉండాలన్నారు. జన్ శిక్షణ సంస్థాన్ ప్రోగ్రామ్ అధికారి బి.సుధాకర్‌రెడ్డి, రిటైర్డ్ ప్రొఫెసర్ రెడ్డెప్పరెడ్డి, పాల్గొన్నారు.

కందిపప్పు సరఫరా చేయండి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చౌక దుకాణాల్లో ప్రతినెలా కందిపప్పు సరఫరా చేయాలని చంద్రగిరి బీజేపీ నాయకుడు సుబ్రమణ్యంయాదవ్ కోరారు. ఆయన గురువారం తహసీల్దార్ శిరీషకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం వల్ల పేదలకు కందిపప్పు అందడం లేదన్నారు. చంద్రగిరి ఇందిరమ్మ కాలనీలో అంగన్వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

బండవేషధారణ, వెయ్యికళ్ల దుత్తలతో అమ్మవారి ఆలయం వద్ద భక్తుల సందడి









కళాబృందాల నాట్య ప్రదర్శనలు

బండ వేషాలతో భక్తుల కేరింతలు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మ జాతరలో రెండోరోజు గురువారం భక్తుల బండ వేషాలతో నగరం హోరెత్తింది. చిన్నా పెద్దా తేడా లేకుండా వేషధారణతో గంగమ్మ ఆలయానికి చేరుకుని ఆలయ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కొందరు కుటుంబ సమేతంగా పొంగళ్లు పెట్టారు. అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పూజలు చేశారు.

నేడు తోటి వేషం

జాతరలో మూడో రోజు శుక్రవారం తోటి వేషాలతో భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు తీర్చుకోనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం బొగ్గుపొడిని శరీరమంతా పూసుకుని తెల్లనామం, కనుబొమ్మల పైన చుక్క బొట్లు పెట్టుకుంటారు. పిల్లలు మీసాలను కూడా పెట్టుకుంటారు. తలకు రిబ్బన్లు, నడుముకు వేపాకు కట్టుకుంటారు. పాత పొరకలను, చాటను చేతపట్టుకుని ఎదురుపడిన వారిని తిన్నగా మోదుతూ ఊరేగుతారు. బూతు పాటలు పాడుతూ సాగుతారు. అనంతరం గంగమ్మ ఆలయానికి



ప్రత్యేక అలంకరణలో తాతయ్యగుంట గంగమ్మ

చేరుకుని అమ్మవారి పాదాల వద్ద వేపాకు, చాట,



పొరకలు పడేస్తారు. అమ్మవారిని బూతులు తిడుతూ కేరింతలతో సందడి చేస్తూ భక్తి పూర్వంగా మొక్కులు చెల్లించుకుంటారు.

గంగమ్మకు సారె సమర్పణ

తిరుపతి మంగళం : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి 1, 50వ డివిజన్ల కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్‌కుమార్ సారె సమర్పించారు. అంతకుముందు వారు భారీ ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



గంగమ్మకు సారెను తీసుకొచ్చిన కార్పొరేటర్లు ఆదం రాధాకృష్ణారెడ్డి, బోకం అనీల్‌కుమార్

ఆకర్షణీయంగా సప్పరాలు

తిరుపతి మంగళం : చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అంగరంగా వైభవంగా నిర్వహిస్తున్న తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరలో సప్పరాలు ప్రత్యేక ఆకర్షణీయంగా ఉండాలని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి సూచించారు. ఆయన గురువారం మంగళం బొమ్మల క్వార్టర్స్ వద్ద తయారు చేస్తున్న సప్పరాలు, వెయ్యికళ్ల దుత్తలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నరసింహాచారి, తయారీదారుడు ఎర్రయ్య పాల్గొన్నారు.



సప్పరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నమయ్య

తిరుపతి కల్చరల్: సంగీత, సాహిత్య, మాండలిక, భక్తి రంగాల్లో అన్నమయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పాత్రికేయుడు మధుసూదన్ తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో చేపడుతున్న అన్నమయ్య జయంతి ఉత్సవాలు గురువారం ఆరవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆయన అన్నమయ్య -బహుముఖ ప్రజ్ఞ అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమయ్య నాటి వైభవాన్ని, సామాజిక జీవనాన్ని అద్భుతంగా వర్ణించారని తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీకి చెందిన ఆచార్య వెంకట రామకృష్ణ శాస్త్రి అన్నమయ్య -వ్యాకరణ ప్రయోగాలు అనే అంశంపై ఉపన్యసించారు. విజయవాడకు చెందిన డాక్టర్ శ్యామలానంద ప్రసాద్ అన్నమయ్య -మాండలికాలు అనే అంశంపై ప్రసంగించారు.

ముగిసిన గంగ జాతర

తిరుపతి రూరల్: తుమ్మలగుంటలో బుధవారం గంగమ్మ జాతర ముగిసింది. గ్రామంలోని నడివీధిలో నెలకొల్పిన గంగమ్మ ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారిని చేతులపై ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తిరుపతి రూరల్ ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అమ్మవారి ప్రతిమను మోశారు. ప్రతి ఇంటా మహిళలు హారతులు పట్టారు.



గంగమ్మ ఊరేగింపులో ఎమ్మెల్యే చెవిరెడ్డి, మోహిత్‌రెడ్డి

సారె ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు

తిరుపతి తుడా : తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతరను పురస్కరించుకుని మున్సిపల్ కార్పొరేషన్ తరపున అమ్మవారికి సారె సమర్పించేందుకు ఏర్పాట్లు చేయాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె గురువారం వివిధ విభాగాధిపతులతో సారె ఊరేగింపుపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అన్ని విభాగాల తరపున మున్సిపల్ కార్పొరేషన్ అధికారికంగా అమ్మవారికి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు సారె సమర్పించనున్నట్లు చెప్పారు. సారె ఊరేగింపు సమయంలో రోడ్డుపై నడిచే భక్తులు, కళాకారులు, ఉద్యోగులకు అనువుగా వాటర్ ట్యాంకర్లతో నీరు పట్టించాలన్నారు. దారిపొడవునా మంచినీరు, మజ్జిగ పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి రిజర్వాయర్ రోడ్డు, ఓల్డ్ మెటర్నిటీ రోడ్డు, భవానీనగర్ జంక్షన్, వీవీ మహల్ రోడ్డు,



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

ఓల్డ్ మున్సిపల్ కార్పొరేషన్ సర్కిల్, తుడా సర్కిల్ మీదుగా సారె ఊరేగింపు ఉంటుందన్నారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు, ఆర్వో కేఎల్ వర్మ, ఎగ్జామినర్ రామచంద్రారెడ్డి, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మలబార్‌లో బ్రైడల్ జ్యువెలరీ ప్రదర్శన



తిరుపతి కల్చరల్: ప్రకాశం రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంలో బ్రైడల్ జ్యువెలరీ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు ఆ షోరూం హెడ్ రెజీష్ తెలిపారు. ఇందులో భాగంగా బ్రాండ్ అంబాసిడర్లు ఆలియా భట్, అనిల్‌కపూర్‌తో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వధువులతో ఒక ప్రత్యేక థీమ్ సాంగ్‌ను చిత్రీకరించినట్లు పేర్కొన్నారు. బ్రైడ్స్ ఆఫ్ ఇండియా 2023 ప్రచారం, ఈ థీమ్ సాంగ్‌తో పాటు అనేక రకాల బ్రైడల్ జ్యువెలరీ లుక్స్, వివిధ ప్రాంతాలకు సంబంధించిన నిర్దిష్టమైన బ్రైడల్ జ్యువెలరీ కలెక్షన్లను కూడా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

గడప గడపలోనూ విశేష ఆదరణ



మోహిత్‌రెడ్డికి హారతులు పడుతున్న మహిళలు



చేనేత కార్మికులతో మాట్లాడుతున్న మోహిత్‌రెడ్డి

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండల ప్రజలు తనను విశేషంగా ఆదరిస్తున్నారని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం చిన్నగొట్టిగల్లు పంచాయతీలో గడప గడపకూ మహా పాదయాత్ర చేపట్టారు. ఆయనకు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. పలువురు స్థానికులు మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మా ఊరికి ఎంతో మేలు చేశారని తెలిపారు. కరోనా సమయంలో కుటుంబ సభ్యులు సైతం దూరం పెడితే మమ్మల్ని ఆదుకున్నారని వివరించారు. ఆయన రుణం తీర్చుకోలేదన్నారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పల్లె ప్రజల ఆలోచనలకు అనుగుణంగా నాన్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అభివృద్ధి పనులు చేపడుతున్నారని తెలిపారు. తాను కూడా శక్తి వంచన లేకుండా పనిచేస్తానన్నారు. జగనన్నను తిరిగి సీఎంను చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ సహదేవరెడ్డి, జెడ్పీటీసీ స్వరూప, సర్పంచ్ మనోహర్, మండల కన్వీనర్ కొండారెడ్డి, గృహసారథుల మండల కన్వీనర్ ఖదీర్‌అహ్మద్, కో–ఆప్షన్ మెంబరు అన్వర్‌బాషా, డివిజన్ అధ్యక్షుడు అక్బర్, మాజీ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు రమణ, ద్వారకనాథరెడ్డి, ఇర్షాద్ పాల్గొన్నారు.

విలీన అధ్యాపకుల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో విలీనమైన ఎయిడెడ్ లెక్చరర్ల పూర్తి సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకోవాలని ఏపీ ప్రభుత్వ కళాశాలల లెక్చరర్ల సంఘం (ఏపీ జీసీఎల్ఏ) నాయకులు కోరారు. వారు గురువారం ఎస్వీయూ వీసీ కే.రాజారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఎయిడెడ్ లెక్చరర్ల సేవలను ఇప్పటి వరకు యూనివర్సిటీలు వినియోగించుకుంటున్నాయని తెలిపారు. వారి సీనియారిటీని సైతం పరిగణనలోకి తీసుకుంటూ వచ్చాయన్నారు. ప్రస్తుతం ప్రభుత్వంలో విలీనమైన అధ్యాపకుల సర్వీస్ రూల్స్ వ్యవహారం కోర్టులో ఉందని తెలిపారు. ఈ క్రమంలో స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధించి పాత సర్వీసులను పరిగణనలోకి తీసుకోవద్దని, తమ సేవలను



వినతి పత్రం అందజేస్తున్న ఏపీ జీసీఎల్ఏ నేతలు

మునుపటిలానే వినియోగించుకోవాలని వారు కోరారు. దీనికి వీసీ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పొదలపల్లి బాబు, జిల్లా కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు, ఎస్.గురు ప్రసాద్, అన్నమయ్య జిల్లా కోశాధికారి పరంధామయ్య, రమాదేవి, డి.లావణ్య కుమారి పాల్గొన్నారు.

టమాట పంటలను పరిశీలించిన అధికారులు



పాకాల : మండలంలోని పదిపుట్లబైలు పరిసర ప్రాంతాల్లో ఇటీవల కురిసిన అకాల వర్షాలకు దెబ్బతిన్న టమాట పంటను గురువారం గుంటూరు జిల్లా జాయింట్ డైరెక్టర్ ఆఫ్ హార్టికల్చర్ బి.సరస్వతి, తిరుపతి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దశరథరామిరెడ్డి పరిశీలించారు. అధిక దిగుబడి కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఉద్యానవన శాఖ ద్వారా రైతు సంఘాలు నిర్మించుకునే కలెక్షన్ సెంటర్స్‌ని పరిశీలించారు. కార్యక్రమంలో చంద్రగిరి ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ, గ్రామ సహాయకురాలు వనజ పాల్గొన్నారు.

రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతులు ఇవ్వాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ ప్రాతిపదికన పదోన్నతి కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి బైరాగిపట్టెడలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఏ శాఖలోనూ లేని విధంగా విద్యాశాఖలో పదోన్నతి కల్పించకుండా విల్లింగ్ పేరుతో ఇంక్రిమెంట్ ఇస్తామనడం హేతుబద్ధం కాదన్నారు. ఇప్పటికే విల్లింగ్ పేరుతో ఎస్‌జీటీలకు రూ.2,500 ఇస్తామని చెప్పి పదోన్నతికి తూట్లు పొడిచారని ఆరోపించారు. పనిచేసిన నెలలకు ఇప్పటికీ ఆ నగదు ఇవ్వలేదన్నారు. తద్వారా వారు ఎస్‌జీటీలా లేక స్కూల్ అసిస్టెంట్లా అని తేల్చుకోలేని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పదోన్నతి అయినా సీనియారిటీ జాబితా ప్రకారం రెగ్యులర్ ప్రాతిపదికన జరగాలని, ఉపాధ్యాయులు పదోన్నతితో క్యాడర్ మార్పు జరిగేలా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ వాణి ఎడిటర్ గాజుల నాగేశ్వరరావు, తిరుపతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు, యువశ్రీ మురళి, రాష్ట్ర కార్యదర్శులు కృష్ణారెడ్డి, రమేష్ బాబు, ఆర్థిక కార్యదర్శి మునికృష్ణనాయుడు, మహిళా కన్వీనర్లు రేణుకా దేవి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుచానూరు ఇన్‌చార్జ్ కార్యదర్శిగా సురేంద్రరావు



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు గ్రామ పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా సురేంద్ర రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీనారాయణ బదిలీ కావడంతో శెట్టిపల్లి పంచాయతీ కార్యదర్శి సురేంద్ర రావును ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఉండడంతో పరిపాలనపై పట్టు సాధించడం సులభతరంగా మారిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని గురువారం రాష్ట్ర మంత్రి ఉషశ్రీ చరణ్, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జ్ గురునాథం దర్శించుకున్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

స్వర్ణరథంపై కల్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాసమంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వర్ణ రథోత్సవం కనులపండువగా సాగింది. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. అనంతరం శ్రీవారి ఉత్సవర్లను వసంత మండపానికి వేంచేపు చేసి ఆస్థానం చేపట్టారు. మధ్యాహ్నం స్నపన తిరుమంజనం చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిచ్చారు.



వైద్య విద్యార్థి హత్యకు నిరసనగా క్యాండిల్ ర్యాలీ

తిరుపతి తుడా: కేరళలో వైద్య విద్యార్థిని వందన దాస్ హత్యను వ్యతిరేకిస్తూ తిరుపతి రుయా ఆస్పత్రి వైద్యులు, వైద్య విద్యార్థులు గురువారం నిరసన తెలిపారు. క్యాండిల్ ర్యాలీ చేపట్టారు.



గజవాహనంపై జగజ్జనని చిద్విలాసం

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారు గురువారం సాయంత్రం గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి జన్మనక్షత్రమైన ఉత్తరాషాడ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. అనంతరం వజ్రవైఢూర్యాలు, మరకత మాణిక్యాలతో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని అలంకార మండపానికి వేంచేపు చేసి ఊంజల్ సేవ చేశారు. అనంతరం అమ్మవారు గజవాహనంపై ఆశీనులై నాలుగు మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.



భాకరాపేట ఘాట్‌లో తప్పిన ప్రమాదం

చంద్రగిరి(తిరుపతి రూరల్): భాకరాపేట ఘాట్‌లో గురువారం లారీ అదుపుతప్పి గుట్టవైపు వెళ్లి బస్సుపై పడింది. ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. చంద్రగిరి పోలీసుల కథనం మేరకు.. పీలేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు 28 మంది ప్రయాణికులతో తిరుపతికి బయలుదేరింది. భాకారాపేట ఘాట్‌లో గోవా నుంచి పెయింట్ డబ్బాలతో వస్తున్న లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో అడవిలోకి దూసుకెళ్లింది. అక్కడి నుంచి లారీ బస్సుపై పడడంతో బస్సు పాక్షికంగా దెబ్బతినింది. ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. కొంచెం ముందు భాగంలో పడి ఉంటే ఘోరం జరిగి ఉండేదని ప్రయాణికులు తెలిపారు. బస్సు డ్రైవర్ బాష చాకచక్యంతో వ్యవహరించడంతో ఘోర ప్రమాదం నుంచి బయటపడ్డామని పేర్కొన్నారు. చంద్రగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఘాట్‌లో గుట్టను ఢీకొట్టి బస్సుపై పడిన లారీ

పార్టీ బలోపేతానికి కృషి

తిరుపతి కల్చరల్: భారత కమ్యూనిస్టు పార్టీకి కీలకమైన ప్రాథమిక శాఖను పటిష్ట పరచడానికి కార్యదర్శులు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం సీపీఐ శాఖల కార్యదర్శుల జిల్లా స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి వాటి పరిష్కారం కోసం సమష్టిగా పోరాటాలు చేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. రామానాయుడు, పి.మురళి, కుమార్‌రెడ్డి, గురవయ్య, సుధాకర్‌రెడ్డి, బాలక్రిష్ణ, జయలక్ష్మి, చిన్నం పెంచలయ్య, నదియా పాల్గొన్నారు.